సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 16 । జూన్ । 2023



టన్ను చీనీ రూ.39 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.39 వేలు పలికాయి. మార్కెట్‌కు 710 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కాసులు కురిపిస్తున్న రెడ్ లేడీ

కొత్త రకం బొప్పాయి రైతులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 4,646 హెక్టార్లలో బొప్పాయి పంటను రైతులు సాగు చేశారు.

8లో

గరిష్టం/కనిష్టం

41.1°/21.7°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోత అధికంగా ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ఖాద్రీ ఆలయానికి రూ.83 లక్షల ఆదాయం



శ్రీవారి హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకల హుండీలను గురువారం లెక్కించినట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ తెలిపారు. 46 రోజులకు హుండీలు లెక్కించగా రూ.83,20,170 ఆదాయం వచ్చిందన్నారు. గతంలో కంటే ఈసారి ఆదాయం ఎక్కువగా వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హుండీల పర్యవేక్షణాధికారి నరసింహరాజు, పాలక మండలి సభ్యులు, కెనరా బ్యాంక్ మేనేజర్ విశ్వనాథ్, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ మరమ్మతు, ఫొటోగ్రఫీపై ఉచిత శిక్షణ



అనంతపురం: రూడ్‌సెట్ సంస్థలో ఉచితంగా సెల్‌ఫోన్ మరమ్మతు, ఫొటోగ్రఫీపై శిక్షణ కల్పిస్తున్నట్లు డైరెక్టర్ కనకేశ్వరుడు ఓ ప్రకటనలో తెలిపారు. జులై 1 నుంచి 30 రోజుల పాటు శిక్షణ కల్పిస్తామన్నారు. ఉచిత భోజన వసతి ఉంటుందన్నారు. 19 నుంచి 35 సంవత్సరాల్లోపు వయస్సున్న యువకులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు 9618876060, 9440905479 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

'దిశ'పై విస్తృత అవగాహన



హిందూపురం: దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నట్లు చూపుతున్న విద్యార్థినులు

సాక్షిబృందం: మహిళా రక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'దిశ' యాప్‌పై జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. గురువారం అన్ని ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు సిబ్బందికి 'దిశ' యాప్‌ను వినియోగించడం ద్వారా కలిగే లాభాలను వివరించారు. మహిళలు, విద్యార్థినులు ఒంటరిగా ఎక్కడికైనా వెళ్లాల్సి వచ్చినా, అగంతకుల బారిన పడినా 'దిశ' యాప్ ద్వారా పోలీసులకు సమాచారం ఇస్తే వెంటనే అక్కడికి చేరుకొని రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

రేపు హుబ్లీ–విశాఖ ప్రత్యేక రైలు




గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా శనివారం హుబ్లీ–విశాఖపట్నం మధ్య వన్‌వే సమ్మర్ స్పెషల్ రైలు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు హుబ్లీ జంక్షన్ (07305) నుంచి బయలుదేరి గదగ్, కొప్పల్, హోస్పేట్, తోర్నగల్లు, బళ్లారి, (వయా గుంతకల్లు బైపాస్ మీదుగా) ఆదోని, రాయచూరు, కృష్ణ, చిత్తపూర్, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాద్, నెలగొండ, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడం, రాజమండ్రి, సామర్లకోట, తుని మీదుగా మరుసటి రోజు సాయంత్రం 4.30 గంటలకు విశాఖపట్నం చేరుతుందన్నారు. ఏసీ–టూటైర్, ఏసీ–3, స్లీప్లర్ కోచ్‌లతోపాటు సెకండ్ క్లాస్ బోగీలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

28 వరకూ గుంతకల్లు–చిక్‌జాజూర్ ప్యాసింజర్ రద్దు

గుంతకల్లు: గుంతకల్లు–చిక్‌జాజూర్ మధ్య తిరిగే ప్యాసింజర్ రైళ్లను ఈనెల 17 నుంచి 28వ తేదీ వరకూ రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బళ్లారి–రాయదుర్గం మధ్య ట్రాక్ పనులు దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మోసగాళ్లు



- నరికొత్త పంథాలో రెచ్చిపోతున్న కేటుగాళ్లు
- గ్రామాలు, చిన్న పట్టణాలే సైబర్ నేరగాళ్ల టార్గెట్
- అమాయకత్వం, అత్యాశతో మోసపోతున్న జనం
- అప్రమత్తంగా ఉండాలంటున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి

- సోమందేపల్లిలో ప్రముఖ బ్రాండ్ల ఫ్రాంఛైజీల పేరుతో ఓ నేరగాడు రూ.కోట్లు కొల్లగొట్టాడు. సరుకు నిల్వ కోసం డిపాజిట్ చేయాల్సి ఉందని.. సాయంత్రానికే రూ.వందకు రూ.10 వడ్డీ ప్రకారం చెల్లిస్తూ వచ్చాడు. రెండు వారాలు గడిచిన తర్వాత ఒక్కసారిగా డబ్బుతో ఉడాయించాడు. ఆయన ఉంటున్న షాపు తాళం వేసి ఉంది. అందులో ఎలాంటి సరుకు లేదు. మోసపోయిన ప్రజలు పోలీసులను ఆశ్రయించారు.
- తాడిమర్రి మండలానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఓ వ్యక్తి బురిడీ కొట్టించాడు. తాను ఆర్మీలో ఉద్యోగం చేస్తానని... కొంత మేర డబ్బులు చెల్లిస్తే.. ఆరు నెలల్లో రెట్టింపు చేసి ఇస్తానని నమ్మబలికాడు. సదరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.6.5 లక్షలు చెల్లించాడు. ఆ తర్వాత ఆర్మీ ఉద్యోగిగా చెప్పుకొనే వ్యక్తి అడ్రస్ లేకుండా పోయాడు. బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.
- హిందూపురంలో వస్తువులపై భారీ రాయితీలు ప్రకటించి ఓ వ్యక్తి చాలా మందిని ఓ మోసం చేశాడు. దీనిపై బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఆన్‌లైన్ వేదికగా డబ్బులు చెల్లించామని.. ప్రస్తుతం ఫోన్ నంబరు వర్కింగ్‌లో లేదని.. సైట్ కూడా ఓపెన్ కావడం లేదని వాపోతున్నారు. ఇలా జిల్లాలో పలుచోట్ల సైబర్ నేరాలు వెలుగు చూస్తున్నాయి.

సాక్షి, పుట్టపర్తి: సైబర్ నేరాలు రోజురోజుకీ కొత్త పుంతలు తొక్కుతున్నాయి. స్మార్ట్ ఫోన్‌ను.. సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. రోజుకో పంథాలో నిలువు దోపిడీ చేస్తున్నారు.

పెరుగుతున్న బాధితుల సంఖ్య..

జిల్లాలో సైబర్ నేరగాళ్ల బాధితుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. కొందరు అమాయకత్వంతో మోసపోతుంటే.. ఇంకొందరు అత్యాశకు పోయి బోల్తా పడుతున్నారు. బాధితుల్లో గృహిణుల నుంచి డాక్టర్లు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, నిరుద్యోగులు ఉన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఖాతాదారులకు తెలియకుండానే ఖాతాల్లో నగదు ఖాళీ చేస్తున్నారు.

వ్యాపార అవకాశాల పేరుతో..



ఏటీఎం కార్డు గడువు ముగిసిందని.. కేవైసీ అప్‌డేట్ చేయాలని.. బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేయాలని.. లాటరీ వచ్చిందని.. కరోనా సాయం మంజూరైందని చెబుతూ అమాయకులకు ఫోన్ చేసి మోసం చేసేవారు. ఫోన్‌లో వచ్చే ఓటీపీలు తెలుసుకోవడం, ఎనీ డెస్క్ ద్వారా స్క్రీన్ షేరింగ్ యాప్‌ల ద్వారా కంట్రోల్‌లోకి తీసుకుని బ్యాంకు ఖాతాలు ఖాళీ చేసేవారు. దీనిపై పోలీసులు అప్రమత్తమై అవగాహన కల్పించారు. ఏటీఎం కేంద్రాల ఏర్పాటు, ప్రముఖ బ్రాండ్‌ల కంపెనీల ఫ్రాంఛైజీలు, మీసేవ కేంద్రాల ఏర్పాటు పేరుతో ఇటీవల కాలంలో ఎక్కువ మోసాలు చేస్తున్నారు. ముందుగా వీటికి సంబంధించిన ప్రకటనలను వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో సర్క్యులేట్ చేస్తున్నారు. వీటిని నమ్మి ఎవరైనా వివరాలు పంపితే సెక్యూరిటీ డిపాజిట్లు, వెరిఫికేషన్ చార్జీలు అంటూ అందినకాడికి దండుకుని ఫోన్లు ఆఫ్ చేస్తున్నారు.

భారీ రాయితీలతో..



ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని షాపింగ్ సైట్ల పేరుతో భారీ రాయితీలు ప్రకటిస్తూ ఆన్‌లైన్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డు వివరాలు తస్కరిస్తున్న ఘటనలు కూడా చాలా వెలుగులోకి వచ్చాయి. ఇందుకోసం సైబర్ నేరగాళ్లు ముందుగా నకిలీ వెబ్‌సైట్లు సృష్టిస్తున్నారు. అందులో స్మార్ట్‌ఫోన్లు, గృహోపకరణాలు, ఇతర వస్తువులపై 50 నుంచి 70 శాతం వరకు రాయితీలు ప్రకటిస్తూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారు. ఆఫర్లకు ఆశపడి డబ్బు చెల్లిస్తే మోసపోయినట్లే. వస్తువు ఇంటికి రాదు. కొన్ని రోజుల తర్వాత సైట్ పని చేయదు. సైట్‌లో నమోదు చేసిన ఆన్‌లైన్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డు వివరాల ద్వారా సైబర్ నేరగాళ్లు ఆ తర్వాత కూడా ఖాతాలు ఖాళీ చేస్తున్నారు.

అవగాహనతోనే మోసాలకు చెక్

ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవడం, సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలను గుడ్డిగా నమ్మకుండా ఉండటం, అనుమానం వస్తే డబ్బులు చెల్లించకుండా పోలీసులను సంప్రదించడం ద్వారా సైబర్ నేరాలకు చాలా వరకు అడ్డుకట్ట వేయొచ్చు. ఆన్‌లైన్‌లో వచ్చే ప్రకటనలకు సంబంధించి అధీకృత వెబ్‌సైట్‌లో చెక్ చేయడం, రివ్యూలు పరిశీలించడం, ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంకు వివరాలు, ఓటీపీలు వెల్లడించకుండా ఉంటే మోసాలకు గురి కాకుండా ఉండొచ్చు.

అప్రమత్తంగా ఉండాలి



ఫోన్లకు వచ్చే ఎస్‌ఎంఎస్‌లను, వాట్సాప్ మెసేజీలను చదివి వాటిని నిజమని నమ్మితే మోసపోవడం ఖాయం. లాటరీ, తక్కువ ధరలు ఆశ చూపడం కూడా మోసం చేసే వారి వలకు చిక్కినట్లే. తెలియని వ్యక్తుల మాటలను నమ్మడం, మెసేజీలను నిజమని భావించడంతో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఫోన్‌లో కానీ.. మాటల రూపంలో కానీ వ్యక్తిగత వివరాలు ఎవరికీ చెప్పవద్దు. ఎలాంటి అనుమానం వచ్చినా ముందుగా పోలీసులను ఆశ్రయిస్తే మంచిది.

– ఎస్‌వీ మాధవ్‌రెడ్డి, ఎస్పీ

రికవరీలు కూడా కష్టమే..

సైబర్ నేరాల విషయంలో రికవరీలు కూడా పోలీసులకు కష్టంగా మారుతోంది. ప్రజల నుంచి కొల్లగొట్టిన డబ్బును నేరస్తులు నేరుగా డిజిటల్ వాలెట్‌లోకి పంపించి అక్కడి నుంచి అమెజాన్ వంటి సైట్లలో గిఫ్ట్ కార్డులు కొనుగోలు చేస్తున్నారు. ఈ గిఫ్ట్ కార్డులను ఆన్‌లైన్ ద్వారా ఇతరులకు అమ్మి డబ్బు పోగు చేసుకుంటున్నారు. నేరాలకు ఉపయోగించిన సిమ్‌కార్డు, నగదు లావాదేవీలకు వినియోగించిన బ్యాంకు ఖాతాలు వేర్వేరు వ్యక్తులకు సంబంధించినవి కావడం, గిఫ్ట్ కార్డు వాడుకునే వారు వేర్వేరు వ్యక్తులు కావడంతో నేరస్తులు అజ్ఞాతంలోకి వెళ్తున్నారు. దీంతో నగదును రికవరీ చేయడం పోలీసులకు కత్తి మీద సాములా మారింది.

పట్టుచీరల అమ్మకానికి 'ఆన్‌లైన్ పోర్టల్'



సమగ్ర వివరాలతో కూడిన కరపత్రాన్ని అందిస్తున్న చేనేత నాయకులు

ధర్మవరం: చేనేత కార్మికులకు మార్కెటింగ్ సౌకర్యాలను అభివృద్ధి పరచడానికి కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించినట్లు డిజైనర్ నాగరాజు, చేనేత నాయకులు తెలిపారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా ఉత్పత్తులను అమ్ముకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ కూడా పూర్తిగా ఉచితమన్నారు. ఆన్‌లైన్‌లో సేల్ జరిగితే ఆ ప్రొడక్ట్‌ని కొరియర్‌లో పంపడానికి, ప్యాకింగ్ చార్జీలను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని చేనేత వస్త్ర ఉత్పత్తిదారులు వినియోగించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ఉచితంగా చేయడానికి విజయవాడలోని చేనేత సేవా కేంద్రం సహాయం చేస్తుందన్నారు. 'ఇండియా హ్యాండ్ మేడ్' పేరుతో వెబ్‌సైట్ పేరు అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. నమోదు చేసుకోదలచిన వారు 7082229554, 8171839156 నంబర్లకు సంప్రదించాలన్నారు.

కోలుకుంటున్న కొంగలు



వీరాపురం వీధుల్లో సంచరిస్తున్న సైబీరియన్ కొంగ

చిలమత్తూరు: మండలంలోని వీరాపురంలో వలస పక్షులైన సైబీరియన్ కొంగలు, వాటి పిల్లలు కోలుకుంటున్నాయి. గత నెల 29న గాలీవాన బీభత్సానికి పదుల సంఖ్యలో కొంగలు మృత్యువాత పడిన విషయం తెలిసింది. ఆ సమయంలో గాయపడిన కొంగలు, వాటి పిల్లలను స్థానికులు సంరక్షిస్తూ వచ్చారు. ఈ క్రమంలో అవి కోలుకుంటుండడంతో గ్రామస్తుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

రిజిస్ట్రేషన్ సేవలు సద్వినియోగం చేసుకోండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు , అధికారులు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని అన్ని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ శాఖ పలు సేవలు అందించనుందని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవల పోస్టర్లను కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేయించడంలో ప్రజలు ఇబ్బంది పడకూడదనే ప్రజల ముంగిటకే ప్రభుత్వం సేవలు తీసుకొచ్చిందన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ అందించే సేవల పోస్టర్లను ప్రతి సచివాలయంలోనూ ప్రదర్శించాలన్నారు. దీనిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ మాధవి మాట్లాడుతూ సచివాలయాల్లో మార్టిగేజ్ రసీదు, వీలునామా, తనిఖీ దస్తావేజు, విక్రేత స్థలాలు, స్పెషల్ వివాహాలు, ఇతర రకాల సేవలను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చేతన్, జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవాని శంకరి, సీపీఓ విజయ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

- ఎంపీ గోరంట్ల మాధవ్
- దివ్యాంగులకు 60 వాహనాల అందజేత
- థ్యాంక్యూ సీఎం సార్ అంటూ లబ్ధిదారుల హర్షం



వాహనాలను పంపిణీ చేస్తున్న ఎంపీ మాధవ్, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల సహాయ సంస్థ చైర్ పర్సన్ ముంతాజ్ పఠాన్

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి ,పేదల కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటూ ఆదర్శవంతమైన పాలనను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ పాలన సువర్ణాక్షరాలతో లిఖించదగినదని ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. గురువారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లాలోని శారీరక విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం ఉచితంగా మోటరైజ్డ్ మూడు చక్రాల స్కూటర్లు అందజేసే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు ఏపీ విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, రాష్ట్ర అధ్యక్షుడు షఫీ, దివ్యాంగుల శాఖ ఏడీ అబ్దుల్ రసూల్ పాల్గొన్నారు.

అర్హులందరికీ న్యాయం..

సకలాంగులతో పాటు దివ్యాంగులకూ సమాన హక్కులు అందిస్తున్నది ఒక్క వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. జిల్లాలో కొంతమంది ప్రాణాంతకమైన మస్కులర్ డిసీజ్‌తో బాధపడుతున్నారని, అలాంటి వారికి పింఛన్ పెంపు, ఉపాధి అవకాశాల విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. జిల్లా కేంద్రంలో అనువైన చోట, పట్టణంలో దివ్యాంగుల కార్యాలయం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగ నియామకాల్లో విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక స్థానం కల్పిస్తామన్నారు. నాయకత్వ లోపం ఉండరాదనే కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లను నియమించారన్నారు. కొందరు దివ్యాంగులు తమకు వాహనం మంజూరు కాలేదని చెప్పగా ఎంపీ మాధవ్ వేదిక మీద నుంచి కిందకు వచ్చి దివ్యాంగులతో పాటు కింద కూర్చొని అర్హత పత్రాలను పరిశీలించారు. సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడి అందరికీ వాహనాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని వారిని సముదాయించారు.

1750 మందికి వాహనాలు..

విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్ధుల సహాయ సంస్థ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్ మాట్లాడుతూ వలంటీర్‌గా పని చేస్తున్న తనకు రాష్ట్ర చైర్‌పర్సన్‌గా అవకాశమిచ్చి ఆదుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 1750 వాహనాలను దివ్యాంగులకు అందించామన్నారు. ఇప్పటి వరకు 11,317 యుడీఐడీ కార్డులు అందించామని, అర్హులు ఉంటే రూ.1 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ రుణాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే మరో విడతలో వాహనాలను అందజేస్తామన్నారు. ఇప్పటి వరకూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూ. కోటి విలువైన ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, క్యాలిపర్స్, ఆర్టిఫిషియల్ లింబ్స్, టచ్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, హియరింగ్ ఎయిడ్స్, వాకింగ్ స్టిక్‌లు తదితరాలను 1133 మందికి అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా భూగర్భ జలవనరులశాఖ అధికారి రాజశేఖరరెడ్డి, ఆర్డీఓ భాగ్యరేఖ, ఎంపీపీ ఏవి రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, ఆరు నియోజక వర్గాల నుండి విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



ఒక్క దరఖాస్తుతో రూ.లక్ష విలువైన మూడు చక్రాల వాహనం ఇచ్చారు. మా కుటుంబం మొత్తం సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఆయన రుణాన్ని ఎన్నటికీ తీర్చుకోం. వాహనం కొంటామన్న ఆశ కూడా లేని మాకు వాహనం ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. మాలాంటి అక్కా చెల్లెమ్మలకు జగనన్న ఎప్పుడూ అండగా ఉండాలి. – గంగాదేవి, ఓడి చెరువు

నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

- సెప్టెంబర్ 15 లోపు అందుబాటులోకి తేవాలని సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం



సమీక్ష సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: 'ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అన్ని ప్రాధాన్యతా భవన నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి... సెప్టెంబర్ 15 నాటికి అందుబాటులోకి తీసుకురావాలి... త్వరలో ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి సన్నద్ధం కావాలి' అని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం అన్ని జిల్లా కలెక్టర్లతో సీఎస్ జవహర్‌రెడ్డి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, రీ సర్వే, స్పందన, జగనన్న సురక్ష, గృహ నిర్మాణాలు, ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పుట్టపర్తి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు జిల్లా అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంపై జిల్లా, మండల, సచివాలయం వారీగా తహసీల్దార్లు, ఎంపీడీఓలు ప్రణాళిక రూపకల్పన చేయాలన్నారు. అనీమియాతో బాధ పడుతున్న 0–5 వయసున్న చిన్నారులు, 10–19 సంవత్సరాల కిశోర బాలికలు, గర్భిణులు, స్టంటెడ్ పిల్లలు, ఎదుగుదల లోపంతో బాధ పడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వైఎస్సార్ కిట్లు, పోషకాహారం, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. రీ సర్వే చేసిన గ్రామాల్లో రాళ్లు నాటే కార్యక్రమం సకాలంలో పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణాల్లో పురోగతి చూపాలన్నారు. ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవాని శంకరి, సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెన్నెల 'గ్రహణ'ం వీడింది!

- గ్రహణ మొర్రితో వెన్నెల అవస్థ
- రూపాయి ఖర్చు లేకుండా శస్త్ర చికిత్స చేయించిన ప్రభుత్వం
- జగనన్న మేలును మరువబోమంటున్న వెన్నెల కుటుంబ సభ్యులు




శస్త్రచికిత్స చేయించుకున్న వెన్నెలకు మందులిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ జయ

కూడేరు: గ్రహణ మొర్రితో జన్మించిన ఓ చిన్నారికి శస్త్రచికిత్స చేయించి ఆ ఇంట కొత్త కాంతులు నింపింది రాష్ట్ర ప్రభుత్వం. రూ. లక్ష వ్యయమయ్యే ఆపరేషన్ ఉచితంగా చేయించడంతో ఆ తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రజారోగ్య పరిరక్షణకు పెద్ద పీట వేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఈ క్రమంలోనే గ్రామీణులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కొన్నిరోజుల క్రితం ఎంఎల్‌హెచ్‌పీ ఆధ్వర్యంలో ఇంటింటా సర్వేకు శ్రీకారం చుట్టారు. కొన్ని రోజుల క్రితం కూడేరు మండలం కమ్మూరులో సర్వే నిర్వహించిన ఎంఎల్‌హెచ్‌పీ జయ.. గ్రామానికి చెందిన వీరనారయణ కుమార్తె వెన్నెల గ్రహణ మొర్రి సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించి వివరాలను యాప్‌లో పొందుపరిచారు. ఆ వివరాల ఆధారంగా జిల్లా వైద్య శాఖ అధికారులు చిన్నారిని ఆపరేషన్ కోసం చెన్నైలోని సవీత ఆస్పత్రికి రెఫర్ చేశారు. వైద్యులు మే 27న ఉచితంగా శస్త్రచికిత్స చేసి గ్రహణమొర్రి లోపాన్ని దూరం చేశారు. ఈ విషయంపై చిన్నారి తండ్రి వీరనారాయణ మాట్లాడుతూ.. శస్త్రచిక్సిత చేయాలంటే దాదాపు రూ.లక్ష పైగానే ఖర్చు అవుతుందని, తమ కుమార్తెకు ఉచితంగా శస్త్రచికిత్స చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రభుత్వానికి, వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపాడు.

కాసులు కురిపిస్తున్న రెడ్ లేడీ

- కొత్త రకం బొప్పాయి సాగుకు రైతుల ఆసక్తి
- ఉమ్మడి జిల్లాలో 4,646 హెక్టార్లలో పంట సాగు
- అత్యధికంగా కళ్యాణదుర్గం డివిజన్‌లో 2,517 హెక్టార్లలో పంట


విరగ్గాసిన బొప్పాయి పంట


గ్రేడింగ్ చేసిన కాయలను లోడుకు తీసుకెళ్తున్న కూలీ

కళ్యాణదుర్గం: ఉద్యాన పంటల సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. ఈ నాలుగేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో బోరుబావుల్లో నీరు సమృద్ధిగా లభ్యమవుతుండడంతో ఎటూ చూసినా బిందు, తుంపర సేద్యాలతో భూములు పచ్చని తోటలతో కళకళలాడుతున్నాయి. ఒకప్పుడు వేరుశనగ, టమాట పంటలకు మాత్రమే అలవాటు పడిన రైతన్నలు ప్రస్తుతం ఉద్యాన పంటలు సాగుతో ఢిల్లీ, ముంబయి, చెన్నై వంటి మహా నగరాలకు పంట ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి ఎదిగారు.

ఫలించిన ఉపాధ్యాయుడి ప్రయోగం..

కళ్యాణదుర్గం వ్యవసాయ డివిజన్ పరిధిలోని చాపిరి గ్రామానికి చెందిన ప్రధానోపాధ్యాయుడు పాతిరెడ్డి తన పూర్వీకుల ద్వారా సంక్రమించిన వ్యవసాయాన్ని నేటికీ కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో తరచూ వివిధ రకాల పంటల సాగుతో ప్రయోగాలు చేయడం ఆయనకు అలవాటుగా మారింది. ఇటీవల తనకున్న ఏడు ఎకరాల పొలంలో 'రెడ్ లేడీ 786' తైవాన్ రకం బొప్పాయి సాగు చేపట్టారు. మొత్తం 5,500 మొక్కలు నాటారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో బొప్పాయి సాగు ఇలా..	
బొప్పాయి సాగు విస్తీర్ణం	4,646 హెక్టార్లు
మొత్తం దిగుబడి	4,41,370 మెట్రిక్ టన్నులు
కళ్యాణదుర్గం డివిజన్ సాగు విస్తీర్ణం	2,517 హెక్టార్లు
కళ్యాణదుర్గం డివిజన్‌లో పంట దిగుబడి	2,39,129 మెట్రిక్ టన్నులు
ప్రస్తుతం టన్ను ధర	రూ.18 వేలు

మొక్క కొనుగోలు మొదలు.. ఇప్పటి వరకూ రూ.6లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. తొలి విడత పంట కోతలో 40 టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను రూ.18 వేలు చొప్పున మార్కెట్‌కు తరలించడంతో రూ.7.20 లక్షలు చేతికి అందాయి. దీంతో పెట్టుబడి పోను రూ.1.20 ఆదాయం దక్కింది. తోటలో ఇంకా 150 టన్నుల పంట ఉంది. వీటి ద్వారా ఎంత లేదన్నా రూ.30 లక్షల నుంచి రూ.35 లక్షలు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లా రైతుల ఆసక్తి..

సంప్రదాయ పంటలతో నష్టాలను చవి చూసిన రైతులు ఈ సారి వినూత్న పంటల సాగు వైపు దృష్టి సారించారు. ఈ క్రమంలో పండ్ల తోటల సాగు విస్తీర్ణం క్రమేపి పెరుగుతూ వస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,646 హెక్టార్లలో బొప్పాయి సాగు లోకి వచ్చినట్లు కళ్యాణదుర్గంలోని కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు తెలిపారు. మొత్తంగా ఈ పంట ద్వారా ఇప్పటి వరకూ 4,41,370 మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించగా... ఇందులో అత్యధికంగా కళ్యాణదుర్గం వ్యవసాయ డివిజన్ పరిధిలో 2,517 హెక్టార్ల ద్వారా 2,39,129 టన్నులు ఉన్నట్లు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను రూ.18 వేలుతో పంట అమ్ముడుబోతుండగా... జూలై నాటికి రూ.25 వేలకు చేరుకునే అవకాశమున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు.

మంచి ఆదాయం ఉంది



నేను ఏడు ఎకరాల్లో బొప్పాయి పంట సాగుకు రూ.6 లక్షలు పెట్టుబడి పెట్టాను. ఇప్పటికే నా చేతికి పెట్టుబడి వచ్చేసింది. ఇంకా తోటలో 150 టన్నుల పంట దిగుబడి ఉంది. జూలై నాటికి మామిడి పంట కాలం అయిపోతుంది. అప్పుడు బొప్పాయి ధరలు మరింతగా పెరుగుతాయని నమ్మకం ఉంది. మనసు పెట్టి చేస్తే వ్యవసాయానికి మించిన మంచి ఆదాయం మరేదానిలోనూ లేదు.

– పాతిరెడ్డి, రైతు, చాపిరి

క్లుప్తంగా

ఎంఈఓ-2 పోస్టుల భర్తీకి అనుమతులు జారీపై హర్షం

ప్రశాంతి నిలయం: విద్యాశాఖలో పర్యవేక్షణ కోసం మండల విద్యాధికారి -2 పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతులిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, పీవీ రమణారెడ్డి, నాయకులు పుల్లారెడ్డి, జంషీద్, శివయ్య, జయరామిరెడ్డి, ఇంద్రప్రసాద్, నాగరాజు, సుదర్శన్‌రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు రెండో విద్యాధికారిని నియమిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆమోదయోగ్యమన్నారు. ఎంఈఓ-2 పోస్టుల భర్తీ నిర్ణయం తీసుకునేలా చొరవ చూపిన ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

94 బస్తాల విత్తన వేరుశనగ స్వాధీనం


చెర్లోపల్లి సచివాలయంలో భద్ర పరిచిన విత్తన వేరుశనగ బస్తాలు

పుట్టపర్తి అర్బన్: మండలంలోని చెర్లోపల్లికి చెందిన టీడీపీ నేత నందబోయిన భాస్కర్ తన ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 94 బస్తాల విత్తన వేరుశనగ కాయలను రెవెన్యూ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు తహసీల్దార్ నవీన్‌కుమార్, ఏఓ వెంకట బ్రహ్మం తెలిపారు. గురువారం సాయంత్రం అందిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా 94 బస్తాల విత్తన కాయలు నిల్వ చేసినట్లు గుర్తించామన్నారు. వీటిని నల్లమాడ మండలం వేళ్లమద్దికి చెందిన రైతు గోవిందరెడ్డి నుంచి కొనుగోలు చేసినట్లు భాస్కర్ తెలిపాడు. స్వాధీనం చేసుకున్న విత్తన కాయలను స్థానిక సచివాలయంలో భద్రపరిచారు.

చెరువుకు గండి

బత్తలపల్లి: మండలంలోని కట్టకిందపల్లి చెరువు కట్ట మధ్యలో రంధ్రం పడడంతో నీరు వృథాగా పోతోంది. విషయాన్ని గమనించిన దంపెట్ల సర్పంచ్ చల్లా కరుణాకరనాయుడు సమాచారం అందించడంతో గురువారం ఉదయం నీటి పారుదల శాఖ డీఈ మహేశ్వరరెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ అనిల్‌కుమార్ అక్కడకు చేరుకుని చెరువు కట్టను పరిశీలించారు.

యువకుడి ఆత్మహత్య

లేపాక్షి: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... లేపాక్షి మండలం పులమతి ఎస్సీ కాలనీకి చెందిన నరసింహప్ప, ఆదెమ్మ దంపతుల కుమారుడు రామాంజినప్ప (35)కు భార్య కల్పన, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగించేవాడు. ఇటీవల మద్యానికి బానిసై అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం కానరాక గతంలో మూడు పర్యాయాలు చెరువులో దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. సకాలంలో స్థానికులు గుర్తించి వెలికి తీసి కాపాడడంతో ప్రాణాలు దక్కాయి. కొన్ని రోజుల క్రితం కాన్పు కోసం భార్య పుట్టింటికి వెళ్లింది. బుధవారం రాత్రి పొద్దు పోయాక తన తల్లిదండ్రులు ఉంటున్న ఇంటి పక్కనే ఉన్న పాతింట్లో నిద్రించేందుకు వెళ్లిన రామాంజినప్ప మంచం తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం తల్లి ఆదెమ్మ వెళ్లి కుమారుడిని నిద్రలేపేందుకు వెళ్లినప్పుడు ఈ ఘటన వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని కిందకు దించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు.

సజావుగా సచివాలయ ఉద్యోగుల బదిలీలు


బదిలీల కౌన్సెలింగ్‌ను పరిశీలిస్తున్న మునిసిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి


పీఆర్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఈ భాగ్యరాజ్

- నగరపాలక సంస్థ పరిధిలో ఆరు కేటగిరిల్లో 95 మందికి కౌన్సెలింగ్
- పీఆర్ పరిధిలో 53 మందికిగాను 43 మందికి బదిలీ

అనంతపురం క్రైం/సిటీ: ఉమ్మడి జిల్లాలోని సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ గురువారం సజావుగా సాగింది. నగరపాలక సంస్థ, వివిధ మునిసిపాలిటీలు, గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న అడ్మినిస్ట్రేటివ్, శానిటేషన్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్, అమినిటీస్, ప్లానింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల కేటగిరిలో ఉద్యోగుల బదిలీకి కౌన్సెలింగ్ చేపట్టారు. అడ్మినిస్ట్రేటివ్, శానిటేషన్‌కు నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి, ఎడ్యుకేషన్, వెల్ఫేర్‌కు కదిరి మునిసిపల్ కమిషనర్ హరిబాబు, అమినిటీస్‌కు ధర్మవరం కమిషనర్ శేషన్న, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ సతీష్‌చంద్ర, ప్లానింగ్‌కు గుంతకల్లు మునిసిపల్ కమిషనర్ మల్లికార్జున, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పంచాయతీ రాజ్ శాఖలో ఆ శాఖ అనంతపురం జిల్లా ఎస్‌ఈ భాగ్యరాజ్, శ్రీసత్యసాయి జిల్లా ఈఈ మురళీ కౌన్సెలింగ్ అధికారులుగా వ్యవహరించారు. దివ్యాంగులైన ఉద్యోగుల కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. వార్డు సచివాలయాల పరిధిలో 107 మంది దరఖాస్తు చేసుకోగా 106 మంది హాజరయ్యారు, అందులో 95 మందికి బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. మరో 11 మంది దరఖాస్తులను తిరస్కరించారు. ఇంజినీరింగ్ విభాగంలో 53 మంది దరఖాస్తు చేసుకోగా, 43 మందికి బదిలీలు చేశారు. కోరుకున్న ప్రాంతాల్లో ఖాళీలు లేకపోవడంతో ముగ్గురు పాత స్థానాల్లోనే ఉంటామంటూ తెలిపారు. మరో ఐదుగురు సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించక పోవడంతో వారి దరఖాస్తులను తిరస్కరించారు. బదిలీ అయిన వారికి సాయంత్రం ఉత్తర్వులు అందజేశారు. పీఆర్ కార్యాలయంలో నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియను డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రాచం రెడ్డి భాస్కర్‌రెడ్డి, రసూల్ పర్యవేక్షించారు.

ఉద్యోగులకు మంచి అవకాశం..

నగరపాలక సంస్థలో చేపట్టిన బదిలీల కౌన్సెలింగ్‌ను మునిసిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఎంతో విలువనిచ్చి బదిలీలకు మంచి అవకాశం కల్పించిందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా బదిలీల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపట్టినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రెట్టింపు ఉత్సాహంతో పేదలకు మెరుగైన సేవలందించాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


సీజ్ చేసిన వాహనంతో అధికారులు

కొత్తచెరువు: మండలంలోని మామిళ్లకుంట క్రాస్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 146 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన విజిలెన్స్ సీఐ సాయిప్రసాద్, ఎస్‌ఐ జయపాల్‌రెడ్డి, ఏఈఈ కుళ్లాయిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది గురువారం తెల్లవారుజామున మామిళ్లకుంట క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ధర్మవరం నుంచి వస్తున్న ఐచర్ వాహనంలో 294 ప్లాస్టిక్ బ్యాగుల్లో 146 కింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకలోని బంగారు పేటకు బియ్యాన్ని తరలిస్తున్నట్లుగా డ్రైవర్ తెలిపాడు. వాహనాన్ని సీజ్ చేసి, బియ్యం తరలింపుదారులపై 6(ఏ) చట్టం కింద కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ స్వాతి తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

వ్యక్తి బలవన్మరణం

గోరంట్ల: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గోరంట్ల మండలం చింతలపల్లికి చెందిన నాగరాజు (42) బేల్దారి పనులతో జీవనం సాగించేవాడు. కొంత కాలంగా మద్యానికి బానిసైన నాగరాజు పనులకు వెళ్లకుండా జులాయిగా మారాడు. ఈ క్రమంలో అప్పులు పెరిగాయి. గురువారం మద్యం తాగేందుకు డబ్బు దొరక్కపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో వెరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గోరంట్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

పాముకాటుతో చిన్నారికి అస్వస్థత

మదనపల్లె: పాముకాటుతో ఓ చిన్నారి అస్వస్థతకు గురైన సంఘటన గురువారం శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలంలో జరిగింది. చీకటిమానుపల్లె పంచాయతీ ఇందుకూరువారిపల్లెకు చెందిన గణేష్, తేజస్విని దంపతుల కుమార్తె త్రివేణి (9 నెలలు) ఇంటి ఎదుట ఆడుకుంటుండగా పాము కాటేసింది. గుర్తించిన తల్లిదండ్రులు వెంటనే ములకలచెరువు 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రైతు దారుణహత్య


హతుడు కురబ గోవిందప్ప


రోదిస్తున్న హతుడి భార్య పోలక్క, బంధువులు


గోవిందప్ప (ఫైల్)

- గొర్రెల మంద వద్ద నిద్రిస్తుండగా గొంతు కోసిన దుండగులు
- అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం: మండలంలోని కదరంపల్లిలో రైతు కురుబ గోవిందప్ప(43) (గోవిందరాజులు) దారుణ హత్యకు గురయ్యాడు. గొర్రెల మంద వద్ద కాపలాకు వెళ్లిన ఆయనను దుండగులు గొంతుకోసి హతమార్చారు. పోలీసులు తెలిపిన మేరకు....

కుటుంబానికి పెద్ద దిక్కుగా..

కదరంపల్లికి చెందిన గోవిందరాజులుకు భార్య పోలక్క, ఇద్దరు కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. తనకున్న పది ఎకరాల్లో పంటలు సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కుమార్తెకు వివాహం చేసి అత్తారింటికి పంపారు. గోవిందరాజులు సోదరుడు, మండల ప్రాదేశిక మాజీ సభ్యుడు వెంకటేశులు మూడు నెలల క్రితం గుండె పోటుతో మృతి చెందాడు. అప్పటి నుంచి తన సోదరుడికి చెందిన పది ఎకరాల పొలంలోనూ సేద్యం చేస్తూ కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచాడు. అన్ని విషయాలు తానే చూసుకుంటూ రెండు కుటుంబాల అవసరాలను తీరుస్తూ వస్తున్నాడు.

గొర్రెల మందకు కాపలాకు వెళ్లి..

కదరంపల్లికి చెందిన గోవిందరాజులు బావమర్ది వెంకటేశులు కుమారుడు మహేష్.. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులోని గురుకుల పాఠశాలలో చదువుకుంటున్నాడు. వేసవి సెలవులు ముగియడంతో బుధవారం కుమారుడిని పాఠశాలలో వదిలి వచ్చేందుకు వెంకటేశులు వెళ్లాడు. వెనుతిరిగి వచ్చే లోపు ఆలస్యమవుతుందని, రాత్రికి గొర్రెల మంద వద్ద కాపలాగా ఉండాలని కోరడంతో గోవిందరాజులు అంగీకరించాడు. దీంతో గొర్రెలను గోవిందరాజులు పొలం వద్ద విడిచి వెంకటేశులు కుమారుడిని పిలుచుకుని జమ్మలమడుగుకు వెళ్లాడు. బుధవారం రాత్రి భోజనం ముగించుకుని గొర్రెల మందకు కాపలాకు వెళ్లిన గోవిందరాజులు.. రాత్రి అక్కడే నిద్రించాడు.

అర్ధరాత్రి దాటిన తర్వాత..

అర్ధరాత్రి గోవిందురాజులు గాఢ నిద్రలోకి చేరుకున్న విషయాన్ని గుర్తించిన దుండగులు.. బలమైన ఆయుధంతో గొంతకోశారు. అధిక రక్త స్రావంతో కొట్టుమిట్టాడుతూ ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం ఉదయం గొర్రెల మంద వద్దకు వెంకటేశులు చేరుకున్నప్పుడు ఈ ఘటన వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న హతుడి భార్య పోలక్క, కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. సమీపంలోని కొండాపురం, తిమ్మసముద్రం, బాలవెంకటాపురం, నుసికొట్టాల తదితర గ్రామాల నుంచి వందల సంఖ్యలో ప్రజలు సంఘటనా స్థలానికి తరలి వచ్చి, హతుడిని పరిశీలించి, బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు.

రంగంలో క్లూస్ టీం..

గోవిందరాజులు హత్య ఘటనను తెలుసుకున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు, సీఐ తేజమూర్తి ఎస్‌ఐలు సుధాకర్, నాగమధు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. రంగంలో స్నిఫ్పర్ డాగ్, క్లూస్ టీంను దింపారు. హత్య జరిగిన ప్రదేశం మొదలు సమీపంలోని పొలాల్లో దుండగుల ఆనవాళ్ల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానితులను వివిధ కోణాల్లో విచారణ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.

అనంత వేదికగా ఆల్ ఇండియా డ్యాన్స్ ఫెస్టివల్

- 'సంధ్యారవళి' పేరుతో 12 గంటల పాటు నిర్విరామ నృత్య ప్రదర్శనలు



వివరాలు వెల్లడిస్తున్న నాట్యాచార్యులు సంధ్యామూర్తి

అనంతపురం కల్చరల్: ఈ నెల 22న అనంతపురంలోని టీటీడీ కల్యాణ మంటపం వేదికగా ఆల్ ఇండియా డ్యాన్స్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ఈ మేరకు అనంతపురంలోని శ్రీనృత్య కళానిలయం వ్యవస్థాపకురాలు సంధ్యామూర్తి తెలిపారు. గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... సంధ్యారవళి పేరిట జరిగే 'ఆల్ ఇండియా డ్యాన్స్ ఫెస్టివల్'లో కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఒడిశా రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన నృత్యకళాకారులతో కలసి తమ శిష్యబృందాలు నాట్య ప్రదర్శన ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 12 గంటల పాటు నిర్విరామంగా సాగే శాస్త్రీయ నృత్య ప్రదర్శనను అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. నృత్య ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీనియర్ కళాకారులు శ్రీనిధి రఘు, నాగమ్మ పాల్గొన్నారు.

పెనుకొండ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మృతి

- నివాళులర్పించిన రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


నీలం రమేష్‌రెడ్డి (ఫైల్)

రాప్తాడు రూరల్/పెనుకొండ: పెనుకొండలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి (55) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. మూడు రోజులుగా ఆయన ఛాతి నొప్పితో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. స్టంట్ కూడా వేశారు. గురువారం ఉదయం మరో మారు గుండెనొప్పి రావడంతో మృత్యువాత పడ్డారు. సమాచారం అందుకున్న పెనుకొండలోని అధ్యాపకులు, విద్యార్థులు కళాశాలలో సంతాపం ప్రకటించారు. కాగా, రమేష్‌రెడ్డి భార్య మాధవి అనంతపురం మండల ఈఓఆర్డీగా చేస్తున్నారు. కుమారుడు ఎంఏ పూర్తి చేశారు.

సుదీర్ఘకాలం ఆర్ట్స్ కళాశాలలో...

నీలం రమేష్‌రెడ్డి సుదీర్ఘకాలం అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడిగా పని చేశారు. ఆ తర్వాత కళ్యాణదుర్గం కళాశాలకు బదిలీపై వెళ్లారు. అక్కడి నుంచి పదోన్నతిపై పెనుకొండ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెళ్లారు. ప్రభుత్వ కళాశాలల టీచర్ల అసోసియేషన్ (జీసీటీఏ) జిల్లా అధ్యక్షుడిగా పదేళ్లు పని చేశారు. గతంలో అనంతపురం స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చారు. ఈయన వద్ద చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. రమేష్‌రెడ్డి మృతి చెందారనే విషయం తెలుసుకున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి.. గురువారం ఉదయం ఆస్పత్రికి వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, అధ్యాపకులు, జీసీటీఏ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్, ఇతర ప్రిన్సిపాళ్లు సంతాపం తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడి మృతి


మల్లికార్జున (ఫైల్)

ధర్మవరం అర్బన్: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరం మున్సిపల్ పరిధిలోని చిన్నూరుకు చెందిన గంటా మల్లికార్జున (34)కు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. బుధవారం ధర్మవరంలో పనులు ముగించుకుని ఇంటికి వెళుతూ శివాలయం వద్ద ఉన్న చెరువులో శరీరాన్ని శుభ్రం చేసుకుంటుండగా అదుపు తప్పి నీటిలో పడ్డాడు. లోతు ఎక్కువగా ఉండడంతో పాటు ఈత రాని కారణంగా నీట మునిగి ఊపిరాడక మృతి చెందాడు. గురువారం ఉదయం చెరువులో మృతదేహం తేలింది. గమనించిన స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో భార్య రామలక్ష్మి అక్కడకు చేరుకుని మృతుడిని మల్లికార్జునగా ధ్రువీకరిస్తూ బోరున విలపించింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ధర్మవరం వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

పాముకాటుతో వివాహిత...

గుడిబండ: మండలంలోని మోరుబాగల్‌కు చెందిన బసవరాజు భార్య మమత (35) పాము కాటుతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... గురువారం ఉదయం ఇంటి ఆవరణలోని నీటి గేట్ వాల్ తిప్పేందుకు వెళ్లిన మమతను అక్కడే పొంచి ఉన్న నాగుపాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కర్ణాటకలోని శిరాలో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం తుమకూరుకు తరలించారు. చికిత్సకు స్పందించక ఆమె మృతిచెందింది. మృతురాలికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ మునిప్రతాప్ తెలిపారు.